# చెరువుల తవ్వకాలకు వ్యతిరేకంగా ఆందోళన

గుడ్లవల్లేరు, న్యూస్‌లైన్ :

అంగలూరు పంచాయతీ పరిధిలో సుమారు 200 ఎకరాల వ్యవసాయ భూమిని చేపల చెరువులుగా మార్చడానికి ప్రభుత్వం అనుమతి ఇచ్చిందంటూ రైతులు, రైతు కూలీలు బుధవారం ఆందోళన చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం, రైతుకూలీ సంఘం నాయకులు గుడివాడ – మచిలీపట్నం రహదారిపై రెండు గంటలపాటు ధర్నా నిర్వహించారు. దీంతో వాహన రాకపోకలు నిలిచిపోయాయి. గ్రీష్మ తాపానికి ప్రయాణికులు ఇబ్బంది పడకుండా నిర్వాహకులు మంచినీటి సౌకర్యం కల్పించి తమకు సహకరించాలని కోరారు. పంటపొలాలను చేపల చెరువులుగా తవ్వడానికి తాము వ్యతిరేకమని చెప్పారు. ఈ సందర్భంగా సిబ్బందితో అక్కడికి వచ్చిన పామర్రు సిఐ వెంకన్నదొర ఆందోళనకు ముందస్తు అనుమతి తీసుకోకపోవడంపై ప్రశ్నించారు. అయితే వారు ఆయన మాటలను లెక్కచేయక పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా శేషుబాబు అనే వ్యక్తిని సిఐ



పక్కకు నెట్టడంతో ఆందోళనకారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసుల వైఖరిని దుయ్యబట్టారు. గుడివాడ పట్టణ సిఐ జి.రామకృష్ణ, డిఎస్‌పి కెఎస్‌ఎన్ మూర్తి, వన్‌టౌన్ ఎస్‌ఐ సత్యకిషోర్ రంగ ప్రవేశం చేసి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు.

## విచారణ జరుగుతోంది

అంగలూరులో 185 ఎకరాల వ్యవసాయ భూమిని చేపల చెరువులుగా మార్చుకోవడానికి గాను తవ్వకాలకు అనుమతి ఇవ్వలేదని డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ఫిషరీస్ అధికారి బి.సూర్యప్రకాశరావు, అసిస్టెంట్ డైరెక్టర్ కె.కనకరాజు విలేకరులకు తెలిపారు. తవ్వకాలు జరుపుకునేందుకు 57 మంది రైతులు కలెక్టర్‌కు దరఖాస్తు చేసుకున్నారని, దీనిపై విచారణ చేస్తున్నామని వారు తెలిపారు. అంగలూరు గ్రామ పంచాయతీ కార్యాలయంపై అధికారులిద్దరూ గ్రామ సర్పంచ్ డొక్కు రాధాకృష్ణ సమక్షంలో స్థానికురాలు పోలుకొండ సుబ్బమ్మ ఇచ్చిన అఫిడవిట్‌ను పరిశీలించారు. చెరువుల తవ్వకాలపై జిల్లా కలెక్టర్ శైలజారామయ్యర్‌కి పోలుకొండ పాపారావు అనే వ్యక్తి చేసిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నామని వారు తెలిపారు. విఆర్‌ఓ నుంచి అడంగల్ సేకరించి పాపారావుకు ఉన్న భూమి వివరాలను తెలుసుకున్నామన్నారు.

విచారణ అనంతరం నివేదికను కలెక్టర్‌కు సమర్పిస్తామన్నారు. ఈ కమిటీలో ఇరిగేషన్, డ్రైనేజీ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, ఫిషరీస్, గ్రౌండ్‌వాటర్ శాఖలకు చెందిన ఉద్యోగులు వ్యవసాయ భూములను పరిశీలించి డివిజనల్ స్థాయికి చెందిన మరొక కమిటీకి నివేదికను సమర్పిస్తారని చెప్పారు. డివిజనల్ స్థాయి కమిటీకి ఆర్డీవో చైర్మన్‌గా ఉంటారన్నారు. ఈ కమిటీ విచారణ అనంతరం తీర్మానం ప్రవేశపెడుతుందన్నారు. ఈ తీర్మానాన్ని కలెక్టర్ చైర్మన్‌గా ఉండే కమిటీ ఆమోదించాల్సి ఉందన్నారు. అనంతరమే తవ్వకాలకు అనుమతి లభిస్తుందన్నారు.